క్లుప్తంగా

పెన్షన్ల పంపిణీలో జాప్యంపై కలెక్టర్‌కు ఫిర్యాదు

తిరువూరురూరల్: ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీలో కొందరు అధికారులు ఉద్దేశ్య పూర్వకంగానే జాప్యం చేశారని మండలంలోని పలువురు సర్పంచులు ఆరోపించారు. ఈ మేరకు జిల్లా కలెక్టరుకు బుధవారం వారు ఫిర్యాదు చేశారు. ఎర్రమాడు సర్పంచి బొర్రా మాధవి మాట్లాడుతూ మండలంలోని ముష్టికుంట్ల, ఎర్రమాడు గ్రామాల్లో పేదల పెన్షన్ పంపిణీలో ఉద్దేశ్య పూర్వకంగా సచివాలయ సిబ్బంది జాప్యం చేయడమే కాకుండా సాంకేతిక కారణాలు చూపి పెన్షన్ సొమ్మును పేదలకు అందజేయలేదని ఆరోపించారు. పెన్షన్లు పంపిణీ చేయకపోవడానికి కారణాలు చెప్పాలని తాను అడిగినా దాటవేశారని చెప్పారు.

కెరీర్ గైడెన్స్‌పై అవగాహన



తిరువూరు: విద్యార్థులు ఏకాగ్రతతో చదివితే మంచి ఫలితాలు సాధించవచ్చని తిరువూరు ఎమ్మెల్యే శ్రీనివాసరావు అన్నారు. స్థానిక జెడ్పీ బాలికోన్నత పాఠశాలలో బుధవారం విద్యార్థినులకు కెరీర్ గైడెన్స్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పోటీ ప్రపంచంలో అకడమిక్ రికార్డుతో పాటు జనరల్ నాలెడ్జ్, కరెంట్ ఎఫైర్స్‌పై పట్టు ఉండాలని, పదో తరగతి అర్హతపైనే పలు ప్రభుత్వోద్యోగాలు కూడా ఉన్నాయన్నారు. ఆర్మీ, నేవీ, ఎయిర్‌ఫోర్స్ వంటి రంగాల్లో కూడా యువతకు మంచి ఉపాధి అవకాశాలున్నాయని చెప్పారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పీఎస్ఎన్ రాజు, ఉపాధ్యాయినులు పాల్గొన్నారు.

నేడు మండల పరిషత్ సమావేశం

ఇబ్రహీంపట్నం: స్థానిక మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపీపీ సమావేశ మందిరంలో గురువారం మధ్యాహ్నం జరుగుతుందని ఎంపీడీఓ ఉమాదేవి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ పాలడుగు జోత్స్న అధ్యక్షతన జరుగనున్న సమావేశంలో వివిధ ప్రభుత్వ శాఖలకు సంబంధించిన అంశాలు, అభివృద్ధి పనులపై సమీక్ష జరుగుతుందన్నారు. సమావేశానికి శాశ్వత ఆహ్వానితులు, ఎంపీటీసీ సభ్యులు, ఆయా గ్రామాల సర్పంచులు తప్పనిసరిగా హాజరుకావాలని కోరారు. అధికారులు తమ శాఖాపరమైన సమగ్ర నివేదికలతో సకాలంలో హాజరుకావాలని ఎంపీడీఓ సూచించారు.

ఎస్సీ శ్మశాన వాటికను అభివృద్ధి చేయాలి



మూలపాడు(ఇబ్రహీంపట్నం): మూలపాడు గ్రామంలోని ఎస్సీ శ్మశాన వాటికను అభివృద్ధి చేయాలని డీసీసీ కార్యదర్శి చింతపల్లి దాస్ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు కలెక్టర్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ జి. సృజనకు బుధవారం వినతిపత్రం అందజేశారు. గ్రామంలోని ఉబ్బడి వాగు పక్కన 2.41 ఎకరాల శ్మశాన వాటిక గతంలో ఎస్సీలకు కేటాయించారని చెప్పారు. వర్షాకాలంలో ఉబ్బడి వాగు పొంగి పొర్లటం వలన శ్మశాన వాటికలోకి నీరు చేరి సమాధి కార్యక్రమాలకు ఆటంకంగా ఉంటోందని వివరించారు. ప్రజల సౌకర్యార్థం శ్మశానంలో మెరక పనులు చేపట్టి ప్రహరీ నిర్మించాలని కోరారు.

నేడు మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

నూజివీడు: పట్టణ మున్సిపల్ కౌన్సిల్ సమావేశం గురువారం ఏర్పాటు చేశామని ఇన్‌చార్జి మున్సిపల్ కమిషనర్ డి. లక్ష్మీనారాయణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మున్సిపల్ చైర్‌పర్సన్ రామిశెట్టి త్రివేణీదుర్గ అధ్యక్షతన మధ్యాహ్నం రెండు గంటలకు మున్సిపల్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో నిర్వహించే ఈ సమావేశంలో కౌన్సిలర్లు, కో–ఆప్షన్ సభ్యులు, సంబంధిత అధికారులు పాల్గొనాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

విద్యార్థులకు దంత వైద్య పరీక్షలు



కొండపల్లి(ఇబ్రహీంపట్నం): కొండపల్లి క్రాంతి హైస్కూల్ పూర్వ విద్యార్థి, ప్రముఖ దంత వైద్య నిపుణులు నరేష్ సహకారంతో విద్యార్థులకు ఉచిత దంత వైద్య పరీక్షలను బుధవారం నిర్వహించారు. విద్యార్థులకు దంత పరీక్షలు నిర్వహించి బ్రష్ చేసుకునే విధానం, దంతాల సంరక్షణ, దంత వ్యాధుల నివారణ తదితర అంశాలను వివరించారు. చిన్నారులు జంక్ ఫుడ్‌కు దూరంగా ఉండాలన్నారు. పాఠశాల కరస్పాండెంట్ వెనిగళ్ల మురళీమోహన్ మాట్లాడుతూ విద్యార్థులకు ఆరోగ్యంపై అవగాహన కల్పించేందుకు ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నామన్నారు. ఎల్‌కేజీ నుంచి టెన్త్ వరకు చదివి నేడు డెంటల్ డాక్టర్‌గా పాఠశాలకు వచ్చిన నరేష్‌ను అభినందించారు. డాక్టర్ వెంకటేశ్వరరావు, వైద్య బృందం, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

ప్రమాదకరంగా వంతెనలు





మైలవరం నుంచి గుర్రాజుపాలెం వెళ్లే రహదారిలో వంతెనపై చప్టా ; వంతెనకు సైడ్‌వాల్స్ విరిగిపోయి ప్రమాదకరంగా ఉన్న చంద్రాల సమీపంలోని కాలువ

మైలవరం: నియోజకవర్గంలోని పలు వంతెనలు ప్రమాదకరంగా మారాయి. కొన్ని వంతెనలకు సైడ్ వాల్స్ లేకపోవడం, మరికొన్ని వంతెనలకు ఉన్న సైడ్ వాల్స్ విరిగిపోయి ప్రమాదకరంగా మారాయి. వేగంగా వచ్చే వాహనాలు అదుపుతప్పి వంతెనపై నుంచి కిందికి పడిపోయే ప్రమాదాలు పొంచి ఉన్నాయి. మైలవరం నుంచి నూజివీడు వెళ్లే ఆర్ అండ్ బీ రహదారి, అదే విధంగా జి.కొండూరు మండలంలోని గుర్రాజుపాలెం వెళ్లే రహదారుల్లో కాలువలపై వంతెనలు ప్రమాదకరంగా మారాయి. చంద్రాల సమీపంలోని నూజివీడు రహదారిలోని కాలువపై నిర్మించిన వంతెన సైడ్‌వాల్స్ విరిగిపోయాయి. మైలవరం నుంచి గుర్రాజుపాలెం వెళ్లే రహదారిలోని వాగుపై చప్టా ప్రమాదకరంగా ఉండి ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. గుర్రాజుపాలెం చప్టాకు ఇరువైపులా రక్షణ గోడలు లేకపోవడంతో రాకపోకల సమయంలో గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారు. గుర్రాజుపాలెం వాసులు ఎక్కువగా మైలవరం రైతు బజారులో తాము పండించిన కూరగాయలు తీసుకువచ్చి విక్రయిస్తుంటారు. రాత్రి వేళల్లో తమ షాపులు మూసివేసి ఇళ్లకు వెళ్లాలంటే వీధి దీపాలు కూడా లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. కాగా నూజివీడు రోడ్డులోని వంతెనపై నుంచి ప్రతి నిత్యం మైలవరం, నూజివీడు మధ్య వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. కాలువలపై వంతెనలకు సైడ్‌వాల్స్ లేకపోవడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ఆందోళన చెందుతున్నారు. కాలువపై వంతెనకు సైడ్ వాల్స్ నిర్మించాలని, దెబ్బతిన్న వాటికి మరమ్మతులు చేయించాలని గ్రామస్తులు, వాహన చోదకులు కోరుతున్నారు.

సమాజ సేవలోనే అసలైన సంతృప్తి



ట్రస్ట్ అధ్యక్షురాలు కోయ సుధతో లబ్ధిదారులు

మైలవరం: సమాజ సేవలోనే అసలైన సంతృప్తి లభిస్తోందని మైలవరం మదర్ థెరిస్సా చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షురాలు కోయ సుధ అన్నారు. మైలవరం నూజివీడు రోడ్డులోని మదర్ థెరిస్సా చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో గత పదేళ్లుగా ట్రస్ట్ ద్వారా ప్రతి నెలా లబ్ధి పొందుతున్న 30 మంది వృద్ధులు, దివ్యాంగులు, కిడ్నీ, ఎయిడ్స్ బాధితులు, అనాథలు ట్రస్ట్ అధ్యక్షురాలు కోయ సుధను బుధవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కోయ సుధ మాట్లాడుతూ తమ ట్రస్ట్ ద్వారా గత పదేళ్లుగా అందిస్తున్న సేవలను వివరించారు. వృద్ధులు, అనాథలు, వితంతువులు, దివ్యాంగులు, కిడ్నీ, క్యాన్సర్, ఎయిడ్స్ బాధితులకు ప్రతి నెలా మందులు, నిత్యావసర వస్తువులు, దుస్తులు, దుప్పట్లు, ఆహారం, కొంత ఆర్థిక సహాయం అందిస్తున్నామని తెలిపారు. అనాథ, పేద విద్యార్థుల చదువులు ఆగకుండా వారికి ఫీజులు చెల్లిస్తున్నామని చెప్పారు. తమ సంస్థ సేవా కార్యక్రమాలకు సహకరిస్తున్న పెద్దలకు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు.

పోలవరం-యడవల్లి రోడ్డు నిర్మాణానికి ప్రతిపాదనలు



యడవల్లి రోడ్డును పరిశీలిస్తున్న ఈఈ బాపిరెడ్డి

చాట్రాయి: మండలంలోని పోలవరం-యడవల్లి రోడ్డు నిర్మాణానికి అంచనాలు తయారు చేయనున్నామని పంచాయతీరాజ్ శాఖ ఈఈ బాపిరెడ్డి బుధవారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వంలో రూ.1.98 కోట్లు మంజూరు అయ్యాయని, ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో పనులు నిలిచిపోయాయని చెప్పారు. ప్రస్తుతం తమ్మిలేరు వాగుపై వంతెన నిర్మాణానికి సుమారు రూ. ఐదు కోట్లు, రెండు కిలోమీటర్ల మేర రోడ్డు నిర్మాణానికి రూ.2 కోట్లు ఖర్చు అవుతుందన్నారు. గురువారం డీఈ, జేఈల ఆధ్వర్యంలో అంచనాలు తయారు చేసి ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపనున్నామని చెప్పారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మరిడి చిట్టిబాబు పాల్గొన్నారు.

ఘనంగా భారతీయ క్రైస్తవ దినోత్సవం



నూజివీడులో కేక్ కట్ చేస్తున్న క్రైస్తవ మత పెద్దలు

నూజివీడు: క్రైస్తవత్వం ప్రేమ మార్గాన్ని బోధిస్తుందని క్రైస్తవ పెద్దలు కేటీ ప్రభాకర్‌రావు అన్నారు. క్రైస్తవ దినోత్సవం సందర్భంగా బుధవారం పట్టణంలోని పలువురు పాస్టర్లు, ఫాదర్లు కలిసి కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా కేటీ ప్రభాకర్‌రావు, స్టాన్లీ ప్రభాకర్‌రావు, జేఆర్ సుశీలరావు తదితరులు మాట్లాడుతూ క్రీస్తు శకం 72వ సంవత్సరంలో ఏసు క్రీస్తు శిష్యుడు పరిశుద్ధ తోమా బలిదానాన్ని జ్ఞాపకం చేసుకుంటూ ఈ కార్యక్రమాన్ని నిర్వహించుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ ఏలూరు జిల్లా క్రిస్టియన్ మైనారిటీ అధ్యక్షుడు పిళ్లా చరణ్, నిమ్మగడ్డ చంద్రకుమార్, తలారి జీవరత్నం, జాన్ వెస్లీ, జ్యోతి వరప్రసాద్ , మహేష్, దేవసహాయం, బ్రదర్ వనమా అనిల్ పాల్గొన్నారు.

విశ్వ నట చక్రవర్తి ఎస్వీ రంగారావు



ఎస్వీఆర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న హజరత్తయ్య గుప్తా , ఎమ్మెల్యే బొండా ఉమా

విజయవాడ కల్చరల్: దివంగత సినీ నటుడు ఎస్వీరంగారావు విశ్వ నట చక్రవర్తి అని సీనియర్ న్యాయవాది వేముల హజరత్తయ్య గుప్తా అన్నారు. కళాంజలి సాంస్కృతిక సేవా సంస్థ, సి.రామ్మోహనరావు కల్చరల్ ఆర్గనైజేషన్, ఎస్వీఆర్ సేవా సమితి ఆధ్వర్యంలో బుధవారం తుమ్మలపల్లి వారి క్షేత్రయ్య కళాక్షేత్రంలో ఎస్వీఆర్ విగ్రహం వద్ద ఎస్వీఆర్ 106 వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న వేముల హజరత్తయ్య గుప్తా మాట్లాడుతూ నవరస నటుడు ఎస్వీఆర్ అని అభివర్ణించారు. ఆయన ఏ పాత్రలోనైనా పరకాయ ప్రవేశం చేయగలరని చెప్పారు. కరుణ రసాత్మకమైన పాత్రలైనా, గంభీర పాత్రలైనా అవలీలగా పోషించగలడన్నారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న సెంట్రల్ ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు ఎస్వీఆర్ నట సేవలను వివరించారు. కళామంజరి వ్యవస్థాపకుడు పీవీఎల్ నృసింహం మాట్లాడుతూ ఆయన నటించిన నర్తనశాల సినిమా ప్రపంచ చలన చిత్రోత్సవంలో ప్రదర్శించారని చెప్పారు. కార్యక్రమంలో చివుకుల హరగోపాల్, నూతలపాటి శ్రీనివాస్, సంపర శ్రీనివాస్, బడేటి ధర్మారావు, చింతకాయల చిట్టిబాబు, బోడి ఆంజనేయరాజు, పరచూరి విజయలక్ష్మి, కోలపల్లి గణేష్, పత్తి పాపారావు, కె.చందు, యు.రాజు, తిరుపతిరాజు తదితరులు పాల్గొన్నారు. అతిథులు ఎస్వీఆర్ విగ్రహాన్ని పూలమాలతో అలంకరించారు. అనంతరం నిర్వాహకులు సెంట్రల్ ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావును ఆత్మీయంగా సత్కరించారు.

ఆదర్శనీయుడు రామ్మోహనరావు

సి.రామ్మోహనరావు ఆలిండియా రేడియోకు అందించిన సేవలు ఎనలేనవని పలువురు వక్తలు అభిప్రాయపడ్డారు. గాంధీనగర్‌లోని సంస్థ కార్యాలయంలో ఆలిండియా రేడియో కళాకారుడు, రంగస్థల, సినీ నటుడు సి.రామ్మోహనరావు జయంతి వేడుకలను కళామంజరి, సి.రామ్మోహనరావు సాంస్కృతిక సేవా సమితి సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించారు. రామ్మోహనరావు సేవా సమితి కార్యదర్శి చివుకుల హరగోపాల్ రామ్మోహనరావు సేవలను కొనియాడారు. కార్యక్రమంలో చివుకుల చిరంజీవి, పీవీఎల్ నృసింహం రామ్మోహనరావు చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

ప్లాస్టిక్ భూతాన్ని తరిమి కొట్టండి



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): పర్యావరణానికి ప్రమాదంగా మారిన ప్లాస్టిక్ భూతాన్ని తరిమి కొట్టాలని సత్యనారాయణపురం ఏకేటీపీ మున్సిపల్ స్కూల్ ఇంచార్జి ప్రధానోపాధ్యాయిని సత్యవేణి అన్నారు. ప్లాస్టిక్ వలన కలిగే నష్టాలపై విద్యార్థి దశ నుండే అవగాహన పెంచుకోవాలని సూచించారు. అంతర్జాతీయ ప్లాస్టిక్ నివారణా దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రజా ప్రగతి ట్రస్ట్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఇండియన్ పొల్యూషన్ కంట్రోల్ అసోసియేషన్, కియా మోటార్స్ వారి సహకారంతో బుధవారం స్థానిక ఏకేటీపీ మున్సిపల్ స్కూల్‌లో పలు కార్యక్రమాలు నిర్వహించారు. విద్యార్థులకు వ్యాసరచన, డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు. పాఠశాల మైదానంలో మొక్కలు నాటారు. ప్లాస్టిక్ వలన కలిగే అనర్థాలను వివరిస్తూ విద్యార్థులు స్కిట్ చేశారు. ప్లాస్టిక్, సీసాలు, కవర్లు ధరించి వినూత్నంగా ప్రదర్శన చేపట్టారు. అధ్యాపకులు శ్రీనివాస్, ప్రజా ప్రగతి ట్రస్ట్ ప్రతినిధి ఎం.నాగేశ్వరరావు, వెంకటేష్, బాలాజీ, జగదీష్, చందు, గౌరీ పాల్గొన్నారు.

డయేరియా నివారణపై అవగాహన



కొండపల్లి(ఇబ్రహీంపట్నం): వర్షాకాలంలో వ్యాపించే డయేరియా నివారణపై కొండపల్లి మూడో వార్డు సచివాలయం పరిధి అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఐసీడీఎస్ సెక్టార్ సూపర్‌వైజర్ జి.రమాదేవి మాట్లాడుతూ డయేరియా బారిన పడిన వారు చేపట్టాల్సిన జాగ్రత్తలను వివరించారు. అత్యవసర పరిస్థితుల్లో జింక్ ట్యాబ్లెట్లు వాడాలన్నారు. ఓఆర్ఎస్ ద్రావణం తయారు చేసుకునే విధానాన్ని ప్రాక్టికల్‌గా చూపించారు. చిన్నారుల తల్లిదండ్రుల సందేహాలను నివృత్తి చేశారు. కార్యక్రమంలో పలువురు అంగన్‌వాడీలు, సచివాలయం, రెవెన్యూ ఉద్యోగులు పాల్గొన్నారు.

అన్నదానం



కొండపల్లి(ఇబ్రహీంపట్నం): దివ్యాంగులను ప్రతి ఒక్కరూ ఆదరించాలని లయన్స్ క్లబ్ ఆఫ్ కొండపల్లి ఇండస్ట్రియల్ పార్క్ అధ్యక్షుడు రేగళ్ల రఘునాథరెడ్డి అన్నారు. లయన్స్ క్లబ్ ప్రతినిధి డీవీ రామిరెడ్డి సహకారంతో లయన్స్ క్లబ్ సభ్యులు స్థానిక శ్రీవిద్య దివ్యాంగుల సంస్థలోని చిన్నారులకు అన్నదాన కార్యక్రమం బుధవారం నిర్వహించారు. భోజన సదుపాయం కల్పించిన లయన్స్ క్లబ్ సభ్యులను సంస్థ యాజమాన్యం అభినందించారు. లయన్స్ క్లబ్ కార్యదర్శి ఎ.సురేష్, సభ్యులు నాగిరెడ్డి, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

చదువుతో పాటు విలువలు పెంపొందించుకోవాలి



లబ్బీపేట(విజయవాడతూర్పు): విద్యార్థులు చదువుతో పాటు విలువలు, సక్రమమైన నడవడిక, క్రమశిక్షణ, బాధ్యతగా మెలగడం వంటి లక్షణాలు పెంపొందించుకోవాలని సీఐఐ ఇండియన్ ఉమెన్ నెట్‌వర్క్ విజయవాడ జోన్ వైస్ చైర్‌పర్సన్ డాక్టర్ వి. నాగలక్ష్మి అన్నారు. ఎంజీరోడ్డులోని నలంద డిగ్రీ కళాశాలలో బుధవారం విద్యార్థులకు సీఐఐ ఉమెన్ నెట్‌వర్క్ ఆధ్వర్యంలో సెల్ఫ్‌కేర్ సెమినార్ నిర్వహించారు. ఈ సెమినార్‌లో డాక్టర్ వి. నాగలక్ష్మి మాట్లాడుతూ విద్యార్థులు జీవితంలో ఉన్నత స్థితికి ఎదగాలంటే లక్ష్యాలు పెట్టుకోవాలన్నారు. అనంతరం మరో అతిథి డాక్టర్ సుదీప్తి వర్ధన్ మాట్లాడుతూ సెల్ఫ్‌కేర్‌లో తెలుసుకోవాల్సిన అంశాలను ప్రజెంటేషన్ ఇచ్చారు. శారీరకంగా, మానసికంగా ఆరోగ్యంగా ఉండాలని, ప్రతిరోజూ క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం ప్రతి ఒక్కరికీ అవసరమన్నారు. కార్యక్రమంలో చాందినీ చందన, కళాశాల ప్రిన్సిపాల్ ఎం. అనురాధ తదితరులు పాల్గొన్నారు.

మామిడి మొక్కల పంపిణీ

ముసునూరు: మొక్కలను పంచ ప్రాణాలుగా భావించి పెంచాలని వలసపల్లి ఎంపీపీ స్కూల్ హెచ్‌ఎం దేవరపల్లి బెనర్జీ అన్నారు. బుధవారం సాయంత్రం ముసునూరులోని ప్రేరణాలయ డైరెక్టర్ సిస్టర్ సుధ ఆధ్వర్యంలో చిన్న, సన్నకారు రైతులకు 100 మామిడి మొక్కలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఇంటా, ప్రతి చోటా, ఇంటింటా మొక్కల పెంపకంతోనే పర్యావరణ సమతుల్యం జరిగి సమస్త జీవరాశి మంచి ఆరోగ్యంతో వర్ధిల్లుతుందన్నారు. ప్రతి ఒక్కరూ విధిగా మొక్కలు నాటి వాటిని పోషించాలని చెప్పారు. వాతావరణ కాలుష్యం నివారణకు వేప, రావి, మర్రి, మామిడి వంటి మొక్కలను పెంచాలని సూచించారు. కార్యక్రమంలో ప్రేరణాలయ సిస్టర్ జాస్సల్, విద్యార్థులు, ఉపదేశులు, రైతులు పాల్గొన్నారు.

నివాస స్థలాలకు పట్టాలు పంపిణీ చేయాలి

ఆగిరిపల్లి: స్థానిక మార్కెట్ యార్డ్ వద్ద రోడ్డు పోరంబోకులో 40 ఏళ్లగా నివసిస్తున్న తమ ఇళ్ల స్థలాలకు పట్టాలు పంపిణీ చేయాలని మంత్రి కొలుసు పార్థసారథిని బుధవారం స్థానిక ప్రజలు కలిసి కోరారు. మార్కెట్ యార్డ్ వద్ద రోడ్డు పోరంబోకు స్థలంలో 40 ఏళ్లగా నివసిస్తున్న తమకు పట్టాలు ఇవ్వకుండా గతంలో పని చేసిన తహసీల్దార్ కొంతమందికే పొజిషన్ ధ్రువీకరణ పత్రాలు ఇచ్చారని మంత్రి పార్థసారథికి స్థానిక ప్రజలు మొరపెట్టుకున్నారు. దీనిపై విచారణ చేసి నివేదిక సమర్పించాలని తహసీల్దార్ మృత్యుంజయరావును మంత్రి ఆదేశించారు.

వాటర్ ట్యాంకులను క్లోరినేషన్ చేయించండి

- డిస్ట్రిక్ డిసీజ్ సర్వేలెన్స్ అధికారి డాక్టర్ నరేంద్ర
- చీపురుగూడెంలో వైద్యశిబిరం పరిశీలన



చీపురుగూడెంలో వైద్య సేవలు అందిస్తున్న విజయలక్ష్మి, వైద్య సిబ్బంది

చాట్రాయి: మండలంలోని చీపురుగూడెంలో పీహెచ్‌సీ ఆధ్వర్యంలో బుధవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. గత రెండు రోజుల నుంచి గ్రామంలో విష జ్వరాలు వ్యాప్తి చెందడంతో 10 మంది పారా మెడికల్ వైద్య బృందం ఇంటింటికీ తిరిగి జ్వరాల బారిన పడినవారిని గుర్తించి వైద్య సేవలు అందించారు. ఈ సందర్భంగా బుధవారం డిస్ట్రిక్ డిసీజ్ సర్వేలెన్స్ అధికారి డాక్టర్ నరేంద్ర వైద్య శిబిరాన్ని పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ వాటర్ ట్యాంకులను క్లోరినేషన్ చేయించాలని, తాగునీటి పైప్‌లైన్ లీకేజీలను గుర్తించి తగిన మరమ్మతులు చేయించాలని, తాగునీటిని పరీక్షలకు పంపించాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, గ్రామంలో మాంసాహారం నిషేధించే విధంగా తగిన చర్యలు తీసుకోవాలని సిబ్బందిని ఆయన ఆదేశించారు. డెప్యూటీ డీఎంహెచ్‌ఓ లక్ష్మీనారాయణ, డీపీఎంఓ విజయలక్ష్మి, ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ జగన్ మోహనరావు వైద్య శిబిరాన్ని సందర్శించారు. పీహెచ్‌సీ వైద్యులు శ్రీనివాసరెడ్డి, దుర్గా ప్రసాదు, ఎం.జ్యోతి వైద్య సేవలు అందించారు.

ముసునూరు: మండలంలోని ముసునూరు, యల్లాపురం గ్రామాల్లో జ్వర బాధితుల గుర్తింపునకు బుధవారం సర్వే చేపట్టారు. ముసునూరులో ఓ వృద్ధురాలు జ్వరం, వాంతులతో పీహెచ్‌సీకి రావడంతో ఆమెను పరీక్షించి, డయేరియా లక్షణాలున్నట్లు గుర్తించి నూజివీడు ఏరియా ఆస్పత్రికి రిఫర్ చేశారు. డయేరియా ముందస్తు నివారణా చర్యల్లో భాగంగా గ్రామంలో జ్వరాల సర్వే నిర్వహిస్తున్నారు. గ్రామ పంచాయతీల ఆధ్వర్యంలో పారిశుద్ధ్య చర్యలు చేపట్టారు.

కె.తాడేపల్లిలో ‘ఉపాధి’ గ్రామ సభ

కె.తాడేపల్లి(విజయవాడరూరల్): కొత్తూరు తాడేపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద బుధవారం ఉపాధి హామీ పథకం సోషల్ ఆడిట్ గ్రామ సభ జరిగింది. గ్రామ సభలో 2023 మార్చి నుంచి 2024 ఏప్రిల్ వరకు గ్రామంలో ఉపాధి నిధులతో జరిగిన పనులకు సంబంధించి సోషల్ ఆడిట్ నివేదిక సమర్పించారు. ఈ సందర్భంగా జిల్లా రిసోర్స్‌పర్సన్ మణికుమార్ గ్రామంలో జగనన్న కాలనీలో ఇల్లు నిర్మించుకున్న లబ్ధిదారులకు 120 పనులకు, పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్‌కు సంబంధించి 20 పనులకు నిధులను వినియోగించారని చెప్పారు. రైతుల పొలాల్లో నీటికుంటల తవ్వకం పనులు, సరిహద్దు ట్రంచ్‌ల తవ్వకం పనులు, పంటకాల్వల అభివృద్ధి పనులు జరిగాయన్నారు. సర్పంచ్ ఉయ్యూరు గోపాలరావు అధ్యక్షతన జరిగిన గ్రామ సభలో ఏపీఓ శ్రీనివాస్, గ్రామ కార్యదర్శి పి.మురళీ మోహనరావు, పలువురు పాలకవర్గ సభ్యులు, ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

జీఓ 117ను రద్దు చేయాలి : పీఆర్‌టీయూ డిమాండ్

మైలవరం: ప్రభుత్వ పాఠశాలలు మనుగడ సాగించాలంటే ప్రభుత్వ జీఓ 117ను వెంటనే రద్దు చేయాలని పీఆర్‌టీయూ మైలవరం శాఖ అధ్యక్షుడు పి. గోపాల్ డిమాండ్ చేశారు. మైలవరంలోని పీఆర్‌టీయూ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన అత్యవసర సమావేశంలో గోపాల్ మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలలు కొనసాగాలంటే తల్లికి వందనం కార్యక్రమాన్ని ప్రభుత్వ పాఠశాలలకు కేటాయించాలని ప్రభుత్వాన్ని కోరారు. నేను బడికి పోతా స్పెషల్ డ్రైవ్ వలన అడ్మిషన్లు పెరగడం లేదని, కొత్త ప్రభుత్వం దీనిపై దృష్టి పెట్టి ప్రభుత్వ పాఠశాలల మనుగడకు చర్యలు తీసుకోవాలని, ప్రతి గ్రామంలో ఐదో తరగతి వరకు ఐదుగురు ఉపాధ్యాయులు ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని, ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన వారికి రిజర్వేషన్లు కల్పించి ప్రోత్సహించాలని కోరారు. సమావేశంలో ఉపాధ్యాయులు సతీష్, పుల్లారెడ్డి, శేషగిరిరావు, నాగలత, సుప్రీకుమారి పాల్గొన్నారు.

రేషన్ పంపిణీలో ఇబ్బందులు రానివ్వద్దు

- పౌరసరఫరాల అధికారుల సూచన
- రేషన్ పంపిణీ వాహనాల తనిఖీ



బియ్యం పంపిణీ తీరును పరిశీలిస్తున్న అధికారులు

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): రేషన్‌కార్డుదారులకు సరుకుల పంపిణీలో ఏ విధమైన ఇబ్బందులు రానివ్వకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సర్కిల్–2 సహాయ పౌర సరఫరాలశాఖ అధికారి ఆచారి మొబైల్ డిస్పెన్సివ్ యూనిట్ (ఎండీయూ) ఆపరేటర్లను ఆదేశించారు. స్థానిక మొగల్రాజపురంలో 224, సత్యనారాయణపురంలోని 213, 214 రేషన్ షాపులను, వాటికి సంబంధించిన మొబైల్ డిస్పెన్సివ్ యూనిట్ ఆపరేటర్ల వాహనాలను బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రేషన్ షాపుల నుంచి తీసుకున్న స్టాకు వివరాలను, పంపిణీ జరుగుతున్న తీరును పరిశీలించారు. రేషన్‌షాపులో ఇచ్చిన స్టాకు ఎండీయూ వాహనంలో ఉన్న స్టాక్ వివరాలతో సరిపోల్చి రికార్డులను పరిశీలించారు. స్టాక్ వివరాలు అంతా సక్రమంగానే ఉన్నట్లుగా తెలిపారు. ఆచారి మాట్లాడుతూ ఉదయం, సాయంత్రం వేళల్లో ప్రభుత్వం నిర్ణయించిన సమయం ప్రకారం కార్డుదారులకు సరుకులు పంపిణీ చేయాలన్నారు. సరుకుల వివరాలతో పాటుగా కార్డుదారులు అడిగే ప్రశ్నలకు ఎండీయూ ఆపరేటర్లు చిరునవ్వుతో సమాధానం చెప్పాలని అన్నారు. పౌరసరఫరాలశాఖ చెకింగ్ ఇన్‌స్పెక్టర్ భగీరథ, ఆ శాఖ ఉద్యోగులు తనిఖీల్లో పాల్గొన్నారు.

13న ప్రధాన మంత్రి విశ్వకర్మ యోజనపై వర్క్‌షాప్

మధురానగర్(విజయవాడసెంట్రల్): ప్రధాన మంత్రి విశ్వకర్మ యోజనపై ఒకరోజు వర్క్ షాప్ ఈ నెల 13వ తేదీన ఎంఎస్‌ఎంఈ చాంబర్ ఆఫ్ కామర్స్ కార్యాలయంలో నిర్వహించనున్నామని చాంబర్ ఆఫ్ కామర్స్ గౌరవాధ్యక్షుడు డాక్టర్ దాసరి దేవరాజ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వర్క్‌షాప్ చాంబర్ డెవలప్‌మెంట్ అధికారి ప్రభ పర్యవేక్షణలో జరుగుతుందన్నారు. వర్క్‌షాప్‌లో కుటీర పరిశ్రమలు, వడ్రంగి, పడవల తయారీ, కమ్మరి, స్వర్ణకారులు, కుమ్మరి, శిల్పకారులు, చెప్పులు కుట్టే వారు, తాపీ పని చేసేవారు, బుట,చాప,చీపుర్లు నేసేవారు, బొమ్మల తయారీ దారులు, క్షురకులు, రజకులు, దర్జీలు, చేపల వల తయారీ దారులకు రూ. ఒక లక్ష నుంచి మూడు లక్షల వరకు రుణ సౌకర్యం బ్యాంకుల నుంచి మద్దతు, డాక్యుమెంటేషన్, మార్కెటింగ్ మద్దతు అందిస్తామన్నారు. ఆసక్తి కలిగిన విశ్వకర్మ యోజన వ్యాపారులు వర్క్ షాప్‌లో పాల్గొనటానికి నోరీ హాస్పిటల్ సమీపంలోని ఎంఎస్‌ఎంఈ చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రధాన కార్యాలయంలో స్వయంగా కానీ, సెల్: 89197 37517, 63059 41717 నంబర్‌లలో కాని తమ పేర్లు నమోదు చేయించుకోవాలన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించాలి



మాట్లాడుతున్న కార్పొరేటర్ వీరమాచనేని లలిత

మధురానగర్(విజయవాడసెంట్రల్): ప్రభుత్వ సేవలను సద్వినియోగం చేసుకుని మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించాలని 28వ డివిజన్ కార్పొరేటర్ వీరమాచనేని లలిత సూచించారు. స్థానిక 28వ డివిజన్ శ్రీనగర్ వాటర్ ట్యాంక్ వద్ద బుధవారం 30 మహిళా గ్రూపు సభ్యుల సర్వసభ్య సమావేశం జరిగింది. కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఒక మహిళ ఆర్థికంగా స్థిరపడితే ఆ కుటుంబం మొత్తం బాగుంటుందని అన్నారు. అందుకే ప్రభుత్వం మహిళల అభివృద్ధికి కృషి చేస్తోందని చెప్పారు.

ప్రతి ఒక్కరూ స్వయం స్వావలంబన సాధించటంతో పాటు మరో నలుగురికి పని ఇచ్చే స్థాయికి ఎదగాలని సూచించారు. నగర పాలకసంస్థ సీడీఓ జగదీశ్వరి మాట్లాడుతూ మహిళల కోసం ప్రభుత్వం పలు పథకాలను అమలు చేస్తోందన్నారు. వాటిని వినియోగించుకుని నిర్దేశించుకున్న లక్ష్యాలు చేరుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కమ్యూనిటీ ఆర్గనైజర్ అలంకార్, ఆర్‌పీ మాధవి, మహిళలు పాల్గొన్నారు.